sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 24-08-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 135 EDITOR: ROHINI



మనుస్మృతికి రాహుల్ మంట

కాంగ్రెస్ నేత వ్యాఖ్యలతో దేశవ్యాప్త దుమారం

పూణే వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. మనుస్మృతిలోని శ్లోకాలను ప్రస్తావిస్తూ ఆయన చేసిన విమర్శలు అగ్నికి ఆజ్యం పోశాయి. ప్రాచీన గ్రంథాల సామాజిక నిబంధనలపై ఇప్పుడు సర్వత్రా పెద్ద ఎత్తున రగడ మొదలైంది.

- సహనం వందే, హైదరాబాద్

- మహిళలకు ఎక్కడా స్వేచ్ఛ లేదని ఆవేదన
- నాడు అంబేడ్కర్... నేడు రాహుల్ గాంధీ

మహారాష్ట్రలోని పుణెలో ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక అంశాలపై మాట్లాడారు. మన దేశంలో మహిళలను సమాజం చూస్తున్న కోణంపై ఆయన తీవ్రమైన విమర్శలు గుప్పించారు. పురుషులు ఇప్పటికీ మహిళలను కేవలం కూతురు, భార్య లేదా తల్లి రూపంలో మూడు కోణాల్లోనే చూస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు మహిళలు నేడు ప్రొఫెషనల్స్ గా, క్రీడాకారిణులుగా, నాయకులుగా, క్రియేటర్లుగా మరియు ఆంత్రప్రెన్యూర్లుగా ఎంతో సాధిస్తున్నారని కొనియాడారు.

మనుస్మృతిలోని కఠిన నిబంధనలు

మహిళల నిజమైన ప్రతిభను, వ్యక్తిగత స్వేచ్ఛను గుర్తించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పిన రాహుల్ గాంధీ, ప్రాచీన గ్రంథమైన మనుస్మృతిలోని కొన్ని అంశాలను ప్రస్తావించారు. ఏ దశలోనూ, ఏ పరిస్థితుల్లోనూ ఒక మహిళ ఎప్పటికీ స్వేచ్ఛగా ఉండకూడదని మనుస్మృతి చెబుతోందని మండిపడ్డారు. ఈ రకమైన భావజాలాన్ని చూసి సిగ్గుపడాలని, ఇలాంటి మాటలను ఏనాడూ సమర్థించకూడదని ఘాటుగా విమర్శించారు. ఈ వ్యాఖ్యల వెనువెంటనే భారతీయ జనతా పార్టీ నుంచి ఆయనపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి.

గ్రంథంలోని ఐదో అధ్యాయంపై విశ్లేషణ

మనుస్మృతిలో మహిళల గురించి నిజంగా ఏం రాశారనే ప్రశ్నపై చరిత్రకారులు, నిపుణులు స్పష్టతనిచ్చారు. మనుస్మృతి అయిదో అధ్యాయం 148వ శ్లోకంలో మహిళల రక్షణ, స్వేచ్ఛకు సంబంధించిన అంశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. మొదట అమ్మాయి తండ్రి సంరక్షణలో, పెళ్లి తర్వాత భర్త సంరక్షణలో, భర్త మరణం తర్వాత పిల్లల దయపై ఆధారపడి బతకాలని పేర్కొన్నారు. భర్తకు సేవ చేయడం ద్వారా మాత్రమే మహిళ స్వర్గాన్ని పొందగలదని ఆ కాలం నాటి నిబంధనలు చెబుతున్నాయని పేర్కొన్నారు.

మనుస్మృతి స్వరూపం...

చరిత్రకారుడు నరహర్ కురుందర్ మనుస్మృతి స్వరూపాన్ని వివరంగా వెల్లడించారు. మనువు రాసిన ఈ ధార్మిక గ్రంథంలో మొత్తం 12 అధ్యాయాలు, 2,684 శ్లోకాలు ఉన్నాయని... కొన్ని ప్రత్యేక కూర్పుల్లో ఈ శ్లోకాల సంఖ్య దాదాపు 2,964 వరకు ఉంటుందని తెలిపారు. క్రీస్తు పూర్వం రెండు మూడు వందల సంవత్సరాల ముందే ఈ పుస్తక రచన ప్రారంభమైందని, సమాజంలో వర్ణ వ్యవస్థకు, నియమ నిబంధనలకు ఈ గ్రంథమే పునాదిగా మారిందని విశ్లేషించారు.

అధ్యాయాలు... ఆచారాలు

మొదటి అధ్యాయంలో ప్రకృతి సృష్టి, నాలుగు యుగాలు, వర్ణాలు, వృత్తులు, రెండో అధ్యాయంలో బ్రహ్మచర్యం, మూడో అధ్యాయంలో వివాహ ఆచారాలు, శ్రాద్ధ కర్మలు, నాలుగో అధ్యాయంలో గృహస్థ ధర్మ విధులు, ఆహార నియమాలు, నరకాల ప్రస్తావన ఉన్నాయి.

అయిదో అధ్యాయం మహిళల విధులు, పవిత్రత గురించి, ఆరో అధ్యాయం సన్యాసి విధులు, ఏడో అధ్యాయం రాజు విధులను ప్రస్తావిస్తాయి. ఎనిమిదో అధ్యాయం నేరం, న్యాయం, వాగ్దానం, రాజకీయ వ్యవహారాలు, తొమ్మిదో అధ్యాయం పితార్జిత ఆస్తి హక్కులు, పదో అధ్యాయం వర్ణాల కలయిక, పదకొండో అధ్యాయం పాపకర్మలు, పన్నెండో అధ్యాయం మూడు గుణాలు, వేదాల ప్రాశస్త్యాన్ని వివరిస్తాయి. ఆధునిక కాలంలోని ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాల మాదిరిగానే అప్పట్లో హక్కులు, నేరాలు, శిక్షల గురించి ఇందులో స్పష్టంగా ఉంది.



అంబేడ్కర్ చేత దహనం...

ఈ మనుస్మృతి వివాదం ఇవాళ్టిది కాదని, దీనికి వందేళ్ల చరిత్ర ఉందని స్పష్టమవుతోంది. సరిగ్గా 1927 జులై 25న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా మహద్‌లో బహిరంగంగా మనుస్మృతిని దహనం చేశారు. మనువే స్వయంగా కుల వ్యవస్థను సృష్టించకపోయినా, దానికి కావాల్సిన బలమైన బీజాలు మాత్రం అతనే వేశాడని అంబేడ్కర్ స్పష్టం చేశారు.

ఐటీ భయం... రియల్ ప్రళయం!

సొంతింటి కలలపై రియల్ మాఫియా పడగ

- కొనుగోళ్లు పడిపోయినా తగ్గని ధరల దౌర్జన్యం
- లేఆఫ్స్ భయం... ఇళ్ల కొనుగోలుకు గండి
- హైదరాబాద్ సహా 8 నగరాల్లో రియల్ ఫ్లీ

దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో తీవ్ర సంక్షోభం ముంచుకొచ్చింది. సామాన్యుడి సొంతింటి కలను ఛిద్రం చేస్తూ ప్రధాన నగరాల్లో గృహ విక్రయాలు భారీగా పడిపోయాయి. అమ్మకాలు పడిపోయినా బిల్డర్లు మాత్రం ధరలను తగ్గించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారు. - సహనం వందే, హైదరాబాద్



దేశంలోని టాప్ ఎనిమిది నగరాల్లో ఇళ్ల విక్రయాలు 6.1 శాతం తగ్గి 91,729 యూనిట్లకు పడిపోయాయి. కొనుగోలుదారుల ఆచితూచి వ్యవహరించే ధోరణి దీనికి కారణమని ప్రాప్ టైగర్ రియల్ ఇన్సైట్ రిపోర్ట్ స్పష్టం చేస్తోంది. ఏడాది క్రితంతో పోలిస్తే డిమాండ్ దారుణంగా పడిపోయినా బిల్డర్లు మాత్రం కొత్త ప్రాజెక్టులను ప్రజల ముందుకు తెస్తూనే ఉన్నారు. విక్రయాలు మందగిస్తున్నా సరఫరాను మాత్రం కృత్రిమంగా పెంచుతూ మార్కెట్ సమతుల్యత పేరుతో సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు.

దూసుకుపోతున్న ధరలు...

విక్రయాలు పడిపోయినప్పుడు సహజంగానే ధరలు తగ్గాలి కానీ ఇక్కడ రియల్టర్ల మాయాజాలం వేరేలా ఉంది. సగటు నివాస ప్రాంతపు ధర చదరపు అడుగుకు 10,153 రూపాయలకు చేరుకుని వరుసగా రెండో త్రైమాసికంలోనూ పది వేల మార్కును దాటేసింది. అన్ని ప్రధాన నగరాల్లోనూ వార్షిక ప్రాతిపదికన ధరలు 4.4 శాతం నుంచి 26 శాతం వరకు విపరీతంగా పెరిగిపోయాయి. అమ్మకాలు తగ్గుతున్నాయంటే కొనుగోలుదారుల దగ్గర డబ్బు లేక కాదు కానీ, ఆకాశాన్ని తాకుతున్న ఈ ధరల దోపిడీని భరించలేక జనం వెనకడుగు వేస్తున్నారు.

నగరాల వారీగా రియల్ మాఫియా...

దేశ ఆర్థిక రాజధాని ముంబై నుంచి టెక్ హబ్ బెంగళూరు, హైదరాబాద్ వరకు అంతటా ఇదే తంతు నడుస్తోంది. బెంగళూరులో అయితే ఏకంగా 26 శాతం ధరలు పెంచి సామాన్యుడికి సొంతింటి కలను గగనంగా మార్చేశారు. ఇక పూణే నగరంలో మొదటిసారిగా చదరపు అడుగు ధర 8,000 రూపాయల మైలురాయిని దాటేసి రికార్డు సృష్టించింది. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం అయితే సామాన్యుడికి ఎప్పటిలాగే పూర్తిగా అందని ద్రాక్షలాగే మిగిలిపోయింది. హైదరాబాద్ వంటి చోట్ల చంద్రపు అడుగుకు చదరపు అడుగుకు 10000 రూపాయలపైగా ఉండటం దారుణం.

చెన్నై, కోల్‌కతాలో భిన్నమైన పరిస్థితులు

చెన్నై, కోల్‌కతా నగరాల పరిస్థితి కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. చెన్నైలో అమ్మకాలు 36 శాతం పెరిగాయని రిపోర్టులు చెబుతున్నా దాని వెనుక పెరుగుతున్న జీవన వ్యయం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక కోల్‌కతాలో ఎన్నికల అనంతరపు తాత్కాలిక ఊపుతో అమ్మకాలు 22 శాతం పెరిగినట్లు కనిపిస్తున్నా దీర్ఘకాలికంగా చూస్తే అక్కడ కూడా సామాన్యుల కొనుగోలు శక్తి వేగంగా క్షీణిస్తోంది. అతి తక్కువ ధర ఉండే అహ్మదాబాద్‌లోనూ ఇప్పుడు ఇదే ద్రవ్యోల్బణ వేడి తగులుతోంది.

ఐటీ రంగంలో అభద్రతా భావం

ఈ రియల్ ఎస్టేట్ సంక్షోభం వెనుక అసలు ప్రమాదకరమైన కోణం ఐటీ, టెక్నాలజీ ఉద్యోగ రంగాలపై ఆధారపడి ఉంది. ముఖ్యంగా బెంగళూరు, పూణే, హైదరాబాద్‌లలో గృహ కొనుగోలుదారులు ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే కావడం గమనార్హం. ఐటీ రంగంలో నిత్యం నెలకొన్న లేఆఫ్‌లు, ఉపాధి అవకాశాల అనిశ్చితి నేరుగా ఈ రంగంపై ప్రభావం చూపుతున్నాయి. ఉద్యోగం పోతుందనే భయంతో ఉన్న మధ్యతరగతి జీవి ఈ ఆకాశాన్నంటే ధరలతో ఇల్లు కొనే సాహసం ఎలా చేయగలడు.

20 దాటితే మూత్రగండమే

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆందోళన

- ప్రతీ ఆరు నెలలకోసారి టెస్టులు తప్పనిసరి
- 66 ప్రతిపాదనలతో ప్రత్యేక నివేదిక
- క్రియాటినిన్‌తో ఈజీఎఫ్ఆర్ రిపోర్ట్ ఇవ్వాలి
- హైరిస్క్ వర్గాలకు జాతీయ ప్రొటోకాల్
- ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ముప్పు ఎక్కువ

పార్లమెంటరీ హెల్త్ ప్యానెల్ తన తాజా నివేదికలో కిడ్నీ కేర్ రంగాన్ని పూర్తిగా మార్చేసేలా మొత్తం 66 సిఫారసులను పొందుపరిచింది. ఇప్పటివరకు ఆసుపత్రికి వెళ్తే తప్ప కిడ్నీ టెస్టుల గురించి పట్టించుకోని పరిస్థితి ఉండేది. కానీ ఇకపై 20 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ నిర్దిష్ట కాల వ్యవధిలో పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరాన్ని ఈ నివేదిక నొక్కి చెప్పింది. - సహనం వందే, హైదరాబాద్

దేశంలో 20 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఇకపై ప్రతి ఆరు నెలల కోసారి కిడ్నీ ఫంక్షన్ టెస్ట్ చేయించుకోవాలంటూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇటీవల రాజ్యసభలో ఒక సంచలన నివేదిక ద్వారా పిలుపునిచ్చింది. పేదరిక రేఖకు దిగువన ఉన్న వారికి ఈ పరీక్షలను పూర్తిగా ఉచితంగా, మిగతా వారికి నామమాత్రపు ధరకే ప్రభుత్వ ఆసుపత్రులు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ల ద్వారా అందించాలని ఈ నివేదిక కోరింది. వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తింపునకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ, ప్రైవేట్ ల్యాబ్‌లలో ఈజీఎఫ్ఆర్ రిపోర్ట్ విధిగా జత చేయాలని ఆదేశించింది.

వ్యాధి నిర్ధారణలో టెక్నికల్ మార్పులు

వ్యాధి నిర్ధారణ పద్ధతుల్లో కూడా ఒక విప్లవాత్మక మార్పు రావాలని కమిటీ నొక్కి చెప్పింది. దేశంలోని ఏ ప్రభుత్వ లేదా ప్రైవేట్ ల్యాబ్‌లో అయినా సీరం క్రియాటినిన్ టెస్ట్ చేస్తే దాంతోపాటు ఆటోమేటిక్‌గా ఈజీఎఫ్ఆర్ రిపోర్ట్ కూడా ఉచితంగా వచ్చేలా నిబంధన పెట్టాలని కోరింది. కేవలం సాధారణ క్రియాటినిన్ లెవెల్స్ చూస్తే కిడ్నీలో అంత ర్గతంగా జరిగే డ్యామేజ్ ముందే తెలియదని, అందుకే సీకేడీ ఈపీఐ ఈక్వేషన్ ఆధారంగా కిడ్నీ పనితీరును కచ్చితంగా అంచనా వేసే ఈజీఎఫ్ఆర్ పరీక్షను విధిగా జత చేయాలని ఆదేశించింది.

హైరిస్క్ వర్గాలకు జాతీయ ప్రొటోకాల్

మధుమేహం, హైబీపీ, ఊబకాయం, గుండె జబ్బులు ఉన్నవారిని... కుటుంబంలో కిడ్నీ వ్యాధుల చరిత్ర ఉన్నవారిని హై రిస్క్ గ్రూపులుగా గుర్తించి వారికి ప్రతి ఏటా క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయాలని సిఫారసు చేసింది. దీనికోసం దేశవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లలో ఒకేరకమైన జాతీయ స్క్రీనింగ్ ప్రోటోకాల్‌ను అమలు చేయాలని సూచించింది. వ్యాధి మరింత ముదిరి కిడ్నీ ఫెయిల్ అయ్యే దశకు వెళ్లకుండా సమర్థవంతంగా అడ్డుకోవచ్చని ప్యానెల్ అభిప్రాయపడింది.

శ్రామికులను వేధిస్తున్న ముప్పు

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు, ఎండలో కష్టపడే శ్రామికులను వేధిస్తున్న కిడ్నీ జబ్బులపై కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఎండ తీవ్రత, తీవ్రమైన డీహైడ్రేషన్, పురుగుల మందుల అవశేషాలు, కలుషిత తాగునీరు ఇందుకు ప్రధాన కారణాలుగా గుర్తించి ఆ ప్రాంతాలపై ప్రత్యేక పరిశోధనలు జరపాలని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో వ్యవసాయ రంగంలో పనిచేసే కార్మికులు ఈ ముప్పు బారిన పడుతున్నారని గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ఉండాలని తేల్చిచెప్పింది.

డయాలసిస్... మార్పిడి సాయం పెంపు

చికిత్స పరంగా కూడా అనేక మార్పులు సూచించారు. దేశంలో ప్రధాన మంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రామ్ కింద ఏడేళ్లలో డయాలసిస్ సెషన్లు భారీగా పెరిగినప్పటికీ, రవాణా సౌకర్యాలు సరిగా లేని మారుమూల ప్రాంతాల్లో రోగుల సౌలభ్యం కోసం హోమ్ బేస్డ్ పెరిటోనియల్ డయాలసిస్ విధానాన్ని మరింత ప్రోత్సహించాలని సిఫారసు చేసింది. అలాగే కిడ్నీ మార్పిడి చేసుకునే రోగులకు సంబంధించి ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్ పీఎంజేవై కింద సర్జరీ తర్వాత కేవలం 15 రోజులు మాత్రమే ఇస్తున్న వైద్య సాయాన్ని, ఏకంగా ఒక ఏడాది పాటు పొడిగించాలని సిఫారసు చేసింది. ఈ ఏడాది కాలంలో ఫాలో అప్ చెకప్‌లు, అత్యవసర పరీక్షలు, ఇమ్యునోస ప్రెసివ్ మందులను ప్రభుత్వమే పూర్తిగా భరించాలని స్పష్టం చేసింది.